ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (పోలవరంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 7-2-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆంజనేయస్వామికి స్వంతపని అంటూ ఏదీలేదు. రాముడు పనే ఆయనపని. రాముడు రూపం ధ్యానం చేసుకోవటం, రామనామం స్మరించుకోవటం, రాముడు పనిచేయటం. ఆయనకు నేను నాది రెండూ లేవు. ఆంజనేయస్వామి తన హృదయంలో రాముడిని ఎలా నిలుపుకున్నాడో అలామన హృదయంలో భగవంతుని నిలుపుకొంటే మన మనస్సు పక్వానికి వస్తుంది. మనకు మోక్షసుఖం తెలుస్తుంది.

దేహప్రారబ్ధమునుబట్టి కష్టం వస్తూ ఉంటుంది, సుఖం వస్తూ ఉంటుంది. మనజీవితంలో వచ్చే కష్ట సుఖాలను ఎలా ఎదుర్కోవాలో, ఎంత శాంతముగా జీవించాలో, వికారము లేకుండా ఎలా జీవించాలో రామాయణంలో పొందికగా వాల్మీకి చెప్పాడు. మానవుడి ప్రవర్తన ఎలా ఉండాలి, మానవుడి ధర్మం ఎలా ఉండాలి అనేది ఎక్కువగా రామాయణంలో కనబడుతుంది.

మనం సింపుల్‌గా ఉంటే పవిత్రులమవుతాము. మనం ఎంత నిరాడంబరముగా ఉంటే అంత పవిత్రత మనకు చేకూరుతుంది. మనం సింపుల్‌గా ఉంటే, పవిత్రంగా ఉంటే దేవుడు మనకు అనుభవంలోనికి వస్తాడు. ఎందుచేతనంటే దేవుడు సింపుల్‌గా ఉంటాడు, పవిత్రంగా ఉంటాడు. దేవుడు పరమపవిత్రుడు. మనం సింపుల్‌గా ఉండటం ప్రాక్టీసు చేస్తే మనకు భగవదనుగ్రహం కలుగుతుంది.

రాముడు అంటే ఆత్మే. దశరథుని కుమారుడు రాముడు వేరు, మనలో ఉన్న ఆత్మారాముడు వేరు కాదు. దశరథుని కుమారుడు రాముడు ఆత్మారాముడే. ఆత్మారాముడు దశరథునికుమారుడు రాముడుగా ఎందుకు అవతరించాడు అంటే మనం ఎలా ప్రవర్తించాలో, ఎలా మాట్లాడాలో ఇంద్రియనిగ్రహం ఎలా నేర్చుకోవాలో, జీవితంలో వచ్చే కష్టాలను ఎలా తట్టుకోవాలో, ఎలా జీవిస్తే ఎలా ప్రవర్తిస్తే మన హృదయంలో ఉన్న ఆత్మారాముడు తెలియబడతాడో మనకు చూపించటంకోసం ఆత్మారాముడే దశరథుని కుమారుడు రాముడిగా అవతరించాడు. మనలను మనం ఎలా నియమించుకుంటే ఆత్మారాముడు దొరుకుతాడో బయట దశరథుని కుమారుడు రాముడు మనకు చూపించాడు.

మనస్సుదగ్గర చెడ్డ ఏమిటిఅంటే నీ గురించి నీవు ఆలోచించుకో అని చెపితే అది వినదు. ఎంతసేపు ఇతరులగురించి చెపుతుంది. ఇతరులు ఎలా ఉంటే మనకుఎందుకు. మన ప్రవర్తన సరిగా చూసుకోవాలి. నువ్వు వచ్చాక ఇతరులు వచ్చారు. నువ్వురాకముందు ఇతరులు లేరు. ఇతరులను విచారణచేసేబదులు నీ మనస్సును విచారణ చేసుకో. మనస్సు తన్నుతాను విచారణ చేసుకుంటేగాని దానిమూలంలోనికి అది వెళ్ళలేదు. మనస్సు దానిమూలంలోనికి వెళితే ఆత్మారాముడు తెలియబడతాడు. నీ గురించి నీవు ఆలోచించుకొని, నీ మనస్సులో ఏమైనా లోపములు ఉంటే చూసుకొని, వాటిని తొలగించుకొని నీవు బాగుపడటానికి ప్రయత్నించు.

మీలో ఏదైనా ఒక వాసన ఉంది అనుకోండి. ఆ వాసన తొలగించుకోవటానికి ఏదో కొంచెము ప్రయత్నం చేసి ఇంకా ఆ వాసన నశించటం లేదు ఏమిటి అని అనుకోకూడదు. రాముడు ఎంత సహనంగా ఉన్నాడో, ఎంత ఓర్పుగా ఉన్నాడో అంత సహనంతోటి, అంత ఓర్పుతోటి మనం సాధన చేస్తే ఆ వాసన

నశిస్తుంది. వాసన నశిస్తుందా, నశించదా అనే అనుమానం ఎవరూ పెట్టుకోవద్దు. మీరు ప్రాక్టీసు చేస్తే తప్పకుండా నశిస్తుంది. వాసనకు అనుగుణంగా వెళ్ళకుండా, వాసనకు ఎదురీది వాసన తొలగించుకోవటానికి మీరు హృదయపూర్వకంగా ప్రయత్నం చేస్తూఉంటే అది నశిస్తుంది. భగవంతుని పూజించటం, జపించటం, ధ్యానించటం ఇవి అన్నీకూడా వాసనను నశింపజేయటానికే. మనలను మనం అణచిఉంచుకోవాలి. ఎంత అణిగి ఉంటే అంతమంచిది. ఇతరులు ఎలా ఉన్నారు అన్నది సమస్యకాదు. రాముడు ఆయన జీవితమును ఎలానియమించుకొన్నాడో నీవుకూడా నీ జీవితమును అలా నియమించుకోవాలి.

నీటిలో కెరటాలు ఎలా వస్తాయో అలాగే రోజూ మన మనస్సులో కెరటాలు వస్తూ ఉంటాయి. నీటిలో కెరటాలు వచ్చినపుడు ఈనీరే కెరటంక్రింద మారుతుంది. కెరటం వేరు, నీరువేరు కాదు. అలాగే మనస్సు ఒకోసారి కోపంక్రింద, ఒకోసారి ద్వేషంక్రింద మారుతుంది. ఒకోసారి వారికి నష్టం వచ్చే పనులు వారే చేసుకొంటారు. ఎందుచేతనంటే ఆ టైములో మనస్సు వారి స్వాధీనంలో ఉండదు. ఏదో కెరటం వస్తుంది. ఆ కెరటానికి లోబడిపోతారు. నీరే కెరటంక్రింద ఎలా మారుతోందో అలాగ మనస్సే కోపంక్రింద, ఇష్టంక్రింద, ద్వేషంక్రింద, చిరాకుక్రింద మారుతోంది. ఆ కెరటాలవేగము తగ్గాలి. ధ్యానంచేయటంవలన ఆ కెరటాలవేగము తగ్గుతుంది. ఒకే వస్తువును నిరంతరము చింతించటం ధ్యానం. మనస్సును నీవు ఎవరు అని అడగటం విచారణ పద్ధతి. నీవు ఎవరవు, ఇంతకాలంనుండి నన్ను పట్టుకొని పీడిస్తున్నావు, నీకు నాకు సంబంధం ఏమిటి అని మనస్సును అడగాలి. విచారణవలన, ధ్యానంవలన మనస్సు దానిమూలంలోనికి వెళుతుంది. దానిమూలంలోనికి వెళ్ళినపుడు మనస్సు నశిస్తుంది. ఎలాగైనా చేయవచ్చు. గమ్యం మాత్రం మనస్సు నశించటం.

ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి భక్తి మనకు సహాయం చేస్తుంది. భక్తి లేకుండా జ్ఞానమురాదు. భక్తిని జ్ఞానమాత అన్నారు భగవాన్. భక్తివలన మనిషి సంస్కరింపబడతాడు. భగవంతునిమీద నీకు ప్రేమ ఉంటే అది భక్తి అన్నారు. ఎదుటిమనిషిమీద ప్రేమ లేకపోతే వాడిలోని దోషములు మనకు కనబడతాయి. ప్రేమ ఉంటే వాడిలోని దోషములు మనకు కనబడవు. ప్రేమలేకుండా భక్తి కలుగదు. ప్రేమ వ్యాపారం చేయదు. ప్రేమకు ఇవ్వటమేగాని అడగటం ఉండదు. భగవంతుడు ప్రేమస్వరూపుడు. ఆయనకు మనపట్ల ప్రేమఉందికాబట్టి మనకు ధ్యానంకుదురుతోంది, ఆయన స్మరణ కుదురుతోంది.

భగవంతునియందు ప్రేమలేకుండా భగవంతుని మనం ధ్యానించలేము. ఒకవేళ చేసినా అది అంటించుకొన్నట్లు ఉంటుందిగాని సహృదయంతో ఉండదు. మనస్సు ఎప్పుడైతే భగవంతుని ప్రేమిస్తోందో ఆప్రేమలోనే అది కరిగిపోతుంది. ఏ దేవుని పూజిస్తున్నారో వాడు ఆత్మని ఇవ్వడు. మీరే ఆత్మఅయినపుడు ఇంక ఆత్మను ఇవ్వటం ఎందుకు. మీరే ఆత్మ అయినప్పటికీ దేహం తెలుస్తోంది, అహంభావన తెలుస్తోంది గాని మీకు ఆత్మ తెలియటంలేదు. ఏకారణములవలన మీరు ఆత్మ అని మీకు తెలియటంలేదో ఆకారణములను తొలగిస్తాడు. వాడు దేవుడు. మనకు భగవదనుభవం పొందటానికి అడ్డువచ్చే అడవినంతా నరుకుతాడు. ఇది దేవుడు చేసేపని.

మీరు సాధన చేసేటప్పుడు మీరు నడిచే దూరం తక్కువగా ఉంటుంది. మీ ప్రేమకు కరిగిపోయి దేవుడే ఎక్కువదూరం వస్తాడు. ఆవిషయం మీకు తెలియకపోయినా జరిగేది అదే. భగవంతునితెలుసుకోవాలి అనే ప్రయత్నం చేస్తూ ఉంటే భగవంతునివైపుకు మీరుచేసే ప్రయాణంకంటే భగవంతుడే ఎక్కువదూరం మీవైపుప్రయాణించి ఆయనలో ఐక్యం చేసుకొంటాడు. కాని మనం ఏమనుకొంటాము అంటే మనమే ఎక్కువ దూరం వెళ్తున్నాము అనుకొంటాము. ఆయనే ఎక్కువదూరం వస్తున్నాడు అని చెపుతున్నారు, నిన్ను నీవు అర్పించుకొని భగవంతుని ప్రేమిస్తూ ఉంటే నీ ప్రేమకు కరిగిపోయి నిన్ను ఆయనలో ఐక్యం

చేసుకొంటాడు. ఆయన అనుగ్రహంవలననే ఆయనతెలియబడతాడుగాని కేవలం నీవు ప్రయత్నం చేసి ఆయనను పొందలేవు. అలాగని నీప్రయత్నం వద్దుఅనికాదు.

మనడ్యూటీ మనంచేస్తూఉండాలి. మా అమ్మ మంచిదికాదు అందుకు చూడటంలేదు అంటారు. అదిమనకు అనవసరము. అమ్మని చూడమని దేవుడు చెప్పాడు కాబట్టి చూడటం అంతే. మంచిదికాకపోతే మనకు నష్టం ఏమిటి అది దేవుడు చూసుకొంటాడు. మనడ్యూటీ మనంచేసేయటమే. భగవంతుడు చెప్పిన పనిని చేయటం, చేయవద్దు అని చెప్పిన పనిని మానివేయటం అంతే.

మనిషిని పీడించేవి వాసనలు - ఒక మనిషికి కోపం వస్తుంది, ఒక మనిషికి అసూయవస్తుంది. ఇవి అన్నీ చూసిమీరు కంగారుపడవద్దు. వారిమీద ద్వేషంపెట్టుకోవద్దు. ఆమనిషిలో ఉన్నవాసన అటువంటిది. కొంతమందికి చంటిపిల్లలకు చెప్పినట్లుగా చెప్పేవారు భగవాన్. అయినా వారు అర్థంచేసుకొనేవారుకాదు. ప్రక్కన ఉన్నవారు ఇంతబాగా చెప్పారు అయినా వారు అర్థంచేసుకోవటంలేదు అంటే వాసన బలీయమైనది అనేవారు భగవాన్. వాడిలో ఉన్న వాసనవలన మనం చెప్పినమాట వాడికి అర్థంకావటంలేదు. పాపం వాడుఏమి చేస్తాడు వాసన అత్యంతబలీయమైనది అనేవారు భగవాన్. పైకి అలా చెప్పేవారుగాని లోపల వాసన తగ్గించటానికి ప్రయత్నంచేసేవారు అదే అనుగ్రహం.

దేహప్రారబ్దం జరగనివ్వండి. కంగారుపడకూడదు. కంగారుపడిచనిపోతే పిశాచజన్మలు వస్తాయి. ప్రారబ్దం ప్రకారం మిమ్మలను ఊరేగిస్తే ఊరేగిస్తారు, మీరు మొట్టికాయిలు తినవలసి ఉంటే తింటారు. ఇవి అన్నీ నిజంకాదు. ప్రారబ్ధంపోవటం మంచిది. ప్రారబ్ధమును అనుభవిస్తే అది పోతుంది.

నీకు ఇష్టం ఉన్నాయుద్ధం చేయాలి, ఇష్టం లేకపోయినా యుద్ధం చేయాలి. నీవు చేసే పనే ఇష్టంతో, ప్రీతితో చెయ్యి. అలా చేస్తే కొత్తవాసనలు రావు, పాతవాసనలు పోతాయి. ఆపనిచేయటం నీకు ఇష్టం లేదు అనుకో ప్రకృతి నీచేతబలవంతంగా చేయిస్తుంది. ఇష్టంలేకుండా చేస్తే పనీ తప్పదు, మనస్సు పాడైపోతుంది. అలా ఉండవద్దు అని కృష్ణుడు అర్జునుడితో చెప్పాడు. కృష్ణుడు చెప్పిన ఈమాటలలో భగవద్గీతాసారం అంతా ఉంది అని నాఉద్దేశ్యం, ఈమాట నాకు బాగా నచ్చింది అని శ్రీనాన్నగారు అన్నారు.

కొంతమంది మనుషులకు మనం ఎంతసేవ చేసినా వారికి గుర్తింపే ఉండదు. కృష్ణుడు ఏమిచెపుతున్నాడు అంటే వారు గుర్తిస్తారు, వారు గుర్తించరు ఆ గొడవనీకు ఎందుకు? వారి హృదయంలో నేను ఉన్నాను కదా నేను గుర్తిస్తాను. నీకు మోక్షం ఇచ్చేవాడిని నేనుకదా. జీవుడు గుర్తిస్తే ఏమిటి, గుర్తించకపోతే ఏమిటి. కర్మఫలితమును ఇచ్చేవాడిని నేను కదా అంటున్నాడు కృష్ణుడు. మీరు చేసే పనినిబట్టే ఫలితం వచ్చివేయదు. ఆయన ఆజ్ఞనుబట్టి ఫలితం వస్తుంది. అది గుర్తుపెట్టుకోండి.

సమాజంలోని పేచీలకు, కుటుంబంలోని పేచీలకు, అన్ని కలతలకు అహంభావనే కారణము. అహంభావనను తొలగించుకోమని ఎక్కువగా భగవాన్ చెపుతూఉండేవారు. ఎందుచేతనంటే అహంభావనవలన మనకు ఉన్న తెలివి చచ్చిపోతుంది. కాలం వృధా అవుతుంది. దీనివలన కోపం వస్తుంది. కోపంవలన శరీరంలో ఉన్న శక్తి అంతాఖర్చుఅయిపోతుంది. నాభర్తమీద కోపంపోవటంలేదు ఎందుకంటే ఇంటికి నలుగురు చుట్టాలు వచ్చినపుడు కూరబాగాలేదు అన్నారు. అప్పటినుండి ఆయనమీద కోపం పోవటంలేదు అని ఒకరు నాతో చెప్పారు. ఆయన అంటే అన్నారులెండి, దానివలన మీకు నష్టం ఏమిటి. అహంభావనే మీరు అనుకోవటంవలన ఈ నష్టం అంతావస్తోంది. విడదీసుకొంటే ఏమీలేదు. కాని ఈకోపంవలన మీకు మూడు నష్టాలు 1) మీకు తెలివితేటలు ఉన్నాయి. దీనివలన తెలివితేటలు తగ్గిపోతున్నాయి. 2) ఇంకోమంచిపని చేసుకోకుండా ఈకోపం అడ్డువస్తోంది. అంటే శక్తిఖర్చు అవుతోంది. 3) కాలం వృధాఅవుతోంది. ఇది

అంతా అహంభావనవలననే వస్తోంది అని చెప్పారు. అహంభావన ఉంటే అంతా ఉంది. అది లేకపోతే ఏదీ లేదు. అహంభావన పోతే ఈ గొడవలు అన్నీ పోతాయి అని చెప్పటంకోసమే అహంభావన తొలగించుకోమని భగవాన్ చెప్పేవారు.

మీ ఇంటిలోని భార్య, పిల్లలు వచ్చి మేము నీ కుటుంబము అని చెప్పటంలేదు. నీవు అనుకొంటున్నావు వారు అంతా నాకుటుంబమే అని. అంటే ఒక దొడ్డివేసుకొంటున్నావు. ఈ జన్మలో ఒకదొడ్డి, రాబోయే జన్మలో ఇంకో దొడ్డి. అంటే ఈ పశువును దొడ్డిమారుస్తారు అన్నమాట. దేహంనుండి విడిపోవటంవలన మోక్షంరాదు. దేహం ఉండగానే అహంభావననుండి విడిపోతే మోక్షం వస్తుంది. ఇంక బందులదొడ్డిలలోనికి వెళ్ళనక్కరలేదు.

కొంతమందికి నమ్మే స్వభావము తక్కువగా ఉంటుంది. అసలు ఏదైతే ఉందో దానిని నమ్మరు. మనస్సు కల్పించిన విషయములను నమ్ముతారు. దేవునిమీద నమ్మకం లేకపోతే, విశ్వాసం లేకపోతే నేనును నమ్ముతున్నావు కదా. ఆనేనునుండి విడిపో. ఈ నేనును తీసుకొనివెళ్ళి భగవంతునికి అర్పించు. నీకు మోక్షం వస్తుంది. నీకు నమ్మే స్వభావం లేకపోతే విచారణచేసి ఈ నేనును పోగొట్టుకో. అలాగైనా మోక్షం వస్తుంది. నీకు తేలికైన మార్గములో ప్రయాణించి ముందునీవు తరించు, దుఃఖములోనుండి బయటపడు.

ఎవడైతే బ్రహ్మంలో ఐక్యమయి బ్రహ్మంగురించి చెపుతున్నాడో వాడు చెప్పినమాటలు విను అని యముడు చెప్పాడు. జ్ఞాని మాటలు ప్రమాణంగా తీసుకో లేకపోతే శాస్త్రమును ప్రమాణంగా తీసుకో. వస్తువు అనుభవంలో లేనివారు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవద్దు. చెప్పేవాడికే విషయం సరిగా తెలియనపుడు వినేవాడికి అర్థమయ్యేలా వాడు ఎలా చెప్పగలడు. వాడు కంగారుపడతాడు. చివరకు వినేవారినికూడా కంగారుపెడతాడు. వాడి Brainలోనే confusion ఉన్నప్పుడు మనకు clarity రాదు. Clarity రాదు అనుకోండి మనం ప్రయాణంచేయలేము. స్పష్టత ఉండాలి.

కొంతమందికి బాహ్యంగా చూస్తే అన్నీ ఉంటాయి. వారుకూడా అశాంతికిగురిఅవుతారు. మనస్సులో బాధపడుతూ ఉంటారు. దీనికి అహంభావనే కారణము. నీ దుఃఖానికి కారణము, నీ అశాంతికి కారణము బయటలేదు. నీలోపలే అహంభావన రూపములో ఉంది. దానిని తగ్గిస్తే నీ అశాంతి తగ్గిపోతుంది, నీ దుఃఖము తగ్గిపోతుంది. నీవు మరల బందులదొడ్డిలోనికి వెళ్ళనక్కరలేదు. దేహము వచ్చింది అంటే బందులదొడ్డిలో పెట్టేస్తారు. అహంభావన నీలోపలే ఉంది కాబట్టి నీవు లోచూపునుపెట్టుకొని దానిని గమనిస్తూ ఉండు. దాని రాకపోకలను చూసుకొంటూ, అది ఎలా విజృంభిస్తోందో చూసుకొంటూ లోచూపుతో దానిని గమనిస్తూ ఉంటే అది అణిగిపోతుంది. దాని విజృంభణ ఆగినపుడు అహంభావన నాశనం అవ్వటం ప్రారంభమవుతుంది. అహంభావన నశించటం ఆత్మానుభవం కలగటం ఒకేసారి జరిగిపోతుంది.

జ్ఞానులు చెప్పిన మాటలు వినండి, మంచి గ్రంధాలు చదవండి, సత్పురుషుల సహవాసం చేయండి, ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండండి, మంచి పనిని మీకు ఇష్టం లేకపోయినా ఇష్టం చేసుకొని చేయండి, ధ్యానం చెయ్యండి, జపం చెయ్యండి ఇవి అన్నీ సాధనకు అవసరమే. కాని వీటి అన్నింటికంటే భగవదనుగ్రహం ముఖ్యం. అంటే మీరు ఏదైనా ఒకపని చేసినా, ఒకమాట మాట్లాడినా అది దేవుని అనుగ్రహం సంపాదించటానికి మీకు సహకరించాలి. సూర్యుడు బయట చీకటిని మాత్రమే పోగొట్టగలడు. లోపల చీకటిని పోగొట్టలేడు. దేవుని అనుగ్రహం వలననే నీలోపల చీకటిపోతుంది. అందువలన అన్నింటికంటే దేవుని అనుగ్రహం ముఖ్యం. అందువలన దేవుని వాక్యమును ధ్యానించుకొంటూ, జానులు చెప్పిన మాటలను ధ్యానించుకొంటూ అజ్ఞానమునుండి బయటపడి నీవు తరించు, సుఖస్వరూపమును పొందు.